
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

మంగళవారం 13 మే 2025

ఉష్ణోగ్రత (అంచనా)

13-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	42	28
తెనాలి	42	28
నరసరావుపేట	41	27
బాపట్ల	39	29
రెంటచింతల	42	28
చీరాల	39	29

రాయితీ పథకం.. లక్ష్యానికి దూరం

- సబ్సిడీ యంత్రాలపై అన్నదాతల అనాసక్తి!
- ధరల్లో భారీగా తేడా ఉండడమే కారణమా?
- ప్రభుత్వం కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చు కాని వైనం



రాయితీపై సేద్య పరికరాలను అందించే విధానాన్ని గత ప్రభుత్వం పూర్తిగా తెరమరుగు చేసి అన్నదాతల ప్రయోజనాలకు గండి కొట్టింది. ఈ ప్రభుత్వం తిరిగి ఆ పథకాన్ని పునరుద్ధరించింది. రాయితీ పొందడానికి మార్గదర్శకాలు విడుదల చేయడమే కాకుండా మూడు జిల్లాలకు నిధుల కేటాయింపు, పరికరాల లక్ష్యాన్ని కూడా నిర్దేశించింది. మామూలుగా అయితే రాయితీ పరికరాల కోసం రైతాంగం నుంచి పెద్ద ఎత్తున దర ఖాస్తులు రావాల్సి ఉంది. కానీ అనూ హ్యంగా స్పందన అంతంతమాత్రంగా ఉండడమే కాకుండా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికే వ్యవసాయశాఖ ఆపసోపాలు పడాల్సి వచ్చింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ పరికరం ధరను బట్టి ప్రభుత్వం ఇస్తున్న రాయితీ 10,000 నుంచి 50,000 వరకు ఉంది. అది పోను మిగిలిన మొత్తాన్ని అన్నదాతలు చెల్లించి పరికరాలను పొందే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. కానీ ఇక్కడే సదరు యంత్రాలను సరఫరా చేసే కంపెనీల మాయాజాలం నడిచినట్లు తెలుస్తోంది. సబ్సిడీ మొత్తం పోనూ రైతు చెల్లించే ధర కూడా కలుపుకుంటే బయటిమార్కెట్ కన్నా ఎక్కువగా ఉన్నట్లు రైతులు గుర్తించారు. నిజానికి ఇది ప్రభుత్వ ఖజానాకు గండికొట్టడమే. కానీ బ్రాండెడ్ లేదా గ్యారెంటీల ముసుగుతో కొటేషన్లు ఎక్కువగా ఇచ్చి కంపెనీల డీలర్లు పబ్బం గడుపుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ధరలు బేరీజు వేసుకున్న రైతాంగం రాయితీ యంత్ర పరికరాలపై ఆది నుంచి విముఖత ప్రదర్శిస్తూనే ఉన్నారు. మండలాల వారీగా అధికారులకు నిర్దేశిత లక్ష్యాలు ఇచ్చి వాటిని పూర్తి చేయాలని మెడమీద కత్తిపెట్టి వ్యవసాయశాఖ పనిచేయించింది. మార్చి చివరికే తుది గడువుగా తొలుత ప్రకటించిన ప్రభుత్వం స్పందన నిరాశజనకంగా ఉండడంతో గడువును పెంచుకుంటూ వచ్చింది. ఈనెల మొదటి వారంతో దరఖాస్తుల ప్రక్రియ నిలిపివేసినట్లు వ్యవసాయశాఖ తెలిపింది. మూడుసార్లు గడువు పొడిగించినా, సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెచ్చినా పరికరాల లక్ష్యం చేరుకోవడంలో మాత్రం వ్యవసాయశాఖ వెనకబడే ఉంది. రాయితీ కోసం ఎగబడాల్సిన రైతాంగం దానిని కాదనుకునే విధంగా వ్యవహరించడం వెనక ఉన్న కారణాలపై దృష్టి పెట్టే పనే వ్యవసాయశాఖ చేయలేదు. సబ్సిడీపై క్షేత్రస్థాయిలో రైతాంగానికి అవగాహన కల్పించడంపై వ్యవస్థల వైఫల్యం కూడా ప్రస్తుత పరిస్థితికి కారణంగా ఉంది. పైగా అన్నదాతల దగ్గర డబ్బులు లేకపోవడం కూడా లక్ష్యాలను చేరుకోకపోవడానికి కారణంగా ఉందనే వాదనను యంత్రాంగం చేయడం విస్తుగొలిపే విధంగా ఉంది

జిల్లాల వారీగా కేటాయింపులు ఇలా..

ఐదేళ్ల పాటు అమలుకు నోచుకోని రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించే కార్యక్రమానికి ప్రస్తుత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా విధివిధానాలను మూడు నెలల క్రితమే జారీ చేయడంతో పాటు జిల్లాల వారీగా లక్ష్యాలనూ నిర్దేశించింది. బాపట్ల జిల్లాకు సంబంధించి కేటాయించిన నిధులు రూ.2.70 కోట్లు కాగా అందించాల్సిన యూనిట్లను 1,400గా తెలిపింది. అదే విధంగా గుంటూరు జిల్లాకు వచ్చేసరికి నిధులు రూ.2.60 కోట్లుకాగా యూనిట్ల సంఖ్య 1,410గా ఉంది. పల్నాడు జిల్లాలో నిధులు రూ.2.75 కోట్లు కాగా యూనిట్ల సంఖ్యను 1,470గా వ్యవసాయశాఖ ప్రకటించింది. అవసరాన్ని బట్టి నిధుల పెంపుపై కూడా నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం తెలిపింది.

వందశాతం చేరుకోవడంలో విఫలం..

జిల్లాల వారీగా కేటాయించిన నిధులే అంతంతమాత్రంగా ఉంటే గడువు పూర్తయ్యేసరికి ఎక్కడా కూడా వందశాతం లక్ష్యాలను చేరుకున్న దాఖలాలు లేవు. బాపట్ల జిల్లాకు మంజూరు చేసిన 1,400 యూనిట్లకు 1100కు మాత్రమే అనుమతులు మంజూరు అయ్యాయి. రూ.2.10 కోట్ల నిధులనే యంత్రాంగం ఖర్చు చేయగా ఇంకా రూ.60 లక్షల నిధులు అలానే ఉన్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోకూడా కేటాయించిన నిధులు, యూనిట్లు మంజూరులో కూడా 75 శాతమే చేరుకున్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఐదేళ్ల పాటు మూలన పడేసిన ఓ పథకాన్ని ఈ ప్రభుత్వం తిరిగి పునరుద్ధరిస్తే వేలల్లో దరఖా స్తులు రావాల్సి ఉండగా నిర్దేశించిన లక్ష్యం చేరుకోవడమే గగనమై పోయింది.

లోపం ఎక్కడ జరిగింది...

రోటోవేటర్ ధరలు కనిష్ఠంగా రూ.80,000 దగ్గర నుంచి రూ.1,50,000 వరకు ప్రభుత్వం మార్గదర్శకాలలో పేర్కొంది. ఇందుకు సంబంధించి రైతుకు అందే రాయితీ రూ.50,000 వరకు ఉంది. సబ్సిడీపోనూ రైతు చెల్లించే మొత్తం కలుపుకుంటే ఈ ధర బయటి మార్కెట్ కన్నా కూడా రూ.30,000 వరకు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అన్నదాతకు సబ్సిడీ వచ్చినా కానీ చెల్లించే మొత్తం దాదాపు బయటి ధరకు సమానంగా ఉండడమే ఈ స్థితికి కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది.



చిన్నారులపై.. వాత్సల్యం!



అనాథ పిల్లలను ఆదుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. 'మిషన్ వాత్సల్య' పేరుతో అనాథ పిల్లలకు నెలనెలా ఆర్థిక సహాయం అందించడంతోపాటు, వారి సంరక్షణకు అడుగులు వేస్తోంది. అందులో భాగంగా తాజాగా రూ. 19.12 కోట్లు విడుదల చేసింది. దీంతో అనాథ పిల్లలకు గొప్ప భరోసా లభించినట్లయింది.

- 'మిషన్ వాత్సల్య' పథకానికి ప్రభుత్వం శ్రీకారం
- అనాథ, నిరుపేద పిల్లలకు నెలకు రూ. 4వేల ఆర్థిక సహాయం
- తన వాటాగా రూ. 19.12 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- లబ్ధిదారుల గుర్తింపు బాధ్యత అంగన్వాడీలదే!

గుంటూరు, మే12(ఆంధ్రజ్యోతి): 'మిషన్ వాత్సల్య' అనేది కేంద్ర ప్రాయోజిత పథకం. ఈ పథకాన్ని 2021 లోనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని అనాథలైన చిన్నారులకు అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ప్రాయోజిత పథకమైన 'మిషన్ వాత్సల్య'కు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాలి. తాజాగా కూటమి ప్రభుత్వం తనవంతు వాటాగా 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ. 19.12 కోట్లు నిధులు విడుదల చేసింది. దీంతో పథకం అమలు లాంఛనప్రాయమయింది.

నెలకు రూ. 4వేలు ఆర్థిక సహాయం

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనాథ చిన్నారులకు నెలకు రూ.4 వేల చొప్పున మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఆర్థిక సహాయం చేస్తారు. ఆదరణ లేని అభాగ్యులు, అనాథ బాలలకు విద్య, వైద్య అవసరాలు తీర్చడం కోసమే ఈ మొత్తాన్ని ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఈ పథకం కేంద్ర ప్రభుత్వ పథకం అయినప్పటికీ లబ్ధిదారుల ఎంపిక రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతుంది. లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా నిధుల కోసం కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయాల్సి ఉంటుంది.

అంగన్వాడీలపై బాధ్యత



రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగన్‌వాడీ పరిధిలో కార్య కర్తలు మిషన్ వాత్సల్య పథకం గురించి విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంటుంది. అర్హులైన చిన్నారులను గుర్తించి వారి పేర్లు నమోదు చేయాల్సిన బాధ్య త కూడా వారిపైనే ఉంటుంది. క్రమం తప్పకుండా యాప్ ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. గుర్తించిన అనాథ పిల్లలు, అర్హులైన చిన్నారుల సంరక్షకులతో మాట్లాడి దర ఖాస్తు చేసు కునేలా అంగన్వాడీ కార్యకర్తలే బాధ్యత తీసుకోవాలి.

అర్హులు ఎవరంటే..

బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం సంరక్షణ ఆదరణ అవసరమైనవారు ఈ పథకానికి అర్హులవుతారు. వితంతువులు, లేదా విడాకులు తీసుకున్న తల్లి సంరక్షణలో ఉండే పిల్లలు, తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయి ఇతరుల వద్ద ఆశ్రయం పొందుతున్న అనాథలు, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రుల బిడ్డలు, పోషించే స్థోమతలేని తల్లిదండ్రుల పిల్లలు, బాలకార్మికులు, బాల్యవివాహాలు, అక్రమరవాణాకు గురైనవారు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులు, తప్పిపోయిన, పారిపోయిన, యాచక చిన్నారులు, వీధుల్లో నివసిస్తున్న, హింసకు, దోపిడీకి గురైన చిన్నారులు, అనాథాశ్రమాల్లో ఉంటూ మద్దతు పునరావాసం అవసరమైన పిల్లలు ఈ పథకానికి అర్హులుగా ఉంటారు.

అర్హతలు ఇలా..

మిషన్ వాత్సల్య పథకం కోసం దరఖాస్తు చేసేవారి కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాలవారికి రూ.98 వేలకు మించి ఉండకూడదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం వర్తించేవారికి ఈ పథకం వర్తించదు.

పరిశీలన ఇలా..

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి దరఖాస్తుల పరిశీలన కూడా జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే జరుగుతుంది. రాష్ట్రంలో 'తల్లిదండ్రులను కోల్పోయినా, తల్లి లేదా తండ్రి లేకున్నా, విడాకులు తీసుకున్న, కుటుంబాన్ని వదిలేసిన తల్లిదండ్రుల పిల్లలు, ప్రాణాంతక వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలకు, అక్రమ రవాణా, దాడులకు గురైన పిల్లలు అర్హులు'గా గుర్తిస్తారు. 18 ఏళ్ల వరకు ప్రతి నెలా రూ.4 వేల చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తుంది. ఈ పథకం కింద ఆరు నెలలకు ఒకసారి, మూడు నెలలకు ఒకసారి నిధుల్ని విడుదల చేస్తారు.



రవినాయక్‌కు ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి, కలెక్టర్ అరుణ్‌బాబు

అభివృద్ధిలో.. అధికారులే కీలకం

- గత ప్రభుత్వ అవినీతి అభివృద్ధికి అవరోధంగా మారింది
- ఏడాదిగా.. సమస్యలు సజీవం
- ప్రజా సమస్యల పరిష్కార వేదికపై ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన పల్నాడుకు జీవం పోయాలంటే అధికారుల పాత్ర ఎంతో కీలకమని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం మాచర్లలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారుల సమన్వయంతోనే ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించవచ్చని పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారుల, ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై, ప్రభుత్వ, ప్రైవేటు భూములను కాజేశారని ఆరోపించారు. అధికారుల అవినీతికి ఎందరో భూ యజమానులు రోడ్డున పడ్డారన్నారు. పోలీసులు కూడా కొన్ని కీలక కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం కేసులో ఇప్పటికీ రికవరీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాచర్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు భూములు అన్యాక్రాంతం అయ్యాయన్నారు.

నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో భూ ఆక్రమణలు, నకిలీ భూపత్రాలతో రుణాలు, నివేశ స్థలాలు, ఇళ్ల కబ్జాలు జరిగాయని, ఆ సమస్యలు అన్నీ నేటికీ సజీవంగానే ఉన్నాయన్నారు. అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో స్పందించకపోవడం వలనే ప్రజలు తనను వెతుక్కుంటూ వస్తున్నారన్నారు. అలాగే నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో రేషన్ బియ్యం సరిగా అందడం లేదని, సివిల్ సప్లయి అధికారులు దీనిపై దృష్టి సారించాలని సూచించారు. పల్నాడుకు అందించాల్సిన నిధులు,సబ్సిడీలను వెంటనే అందేలా చూడాలని కలెక్టర్ అరుణ్‌బాబును కోరారు.



త్రికోటేశ్వరుడికి మల్లెపూలాభిషేకం

వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామికి సోమవారం సాయంత్రం మల్లెపూ లతో అభిషేకం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి విశేష పూజలు చేశారు. స్వామికి ఘనంగా రుద్రాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండల రావు, ఈవో చంద్రశేఖరరావు భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. **- కోటప్పకొండ, ఆంధ్రజ్యోతి**

పసుమర్రులో బంగారం చోరీ

చిలకలూరిపేట, మే12 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలో జెండా చెట్టు ప్రాంతంలో ఉన్న ఒక గృహంలో దొంగతనం జరిగింది. ఈ దొంగతనంలో సుమారు రూ.35 లక్షల విలువచేసే 40 సవర్లకు పైగా బంగారు నగలు అపహరణ జరిగినట్లుగా గుర్తించారు. యలగాల అనసూయమ్మ అనే మహిళ 5 రోజుల క్రితం తన బంధువులు ఇంటికి వెళ్లి ఆదివారం రాత్రి ఇంటికి వచ్చిన సమయంలో దొంగతనం జరిగినట్లుగా గుర్తించింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు, ఇంటిలోని బీరువా పగలగొట్టి బంగారం, వెండి, రాగివస్తువులు దొంగిలించినట్లు గుర్తించింది. ఇందుకు సంబంధించి చిలకలూరిపేట రూరల్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. సంఘటన జరిగిన ప్రదేశానికి చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్సై అనిల్ కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు పోతున్నాయ్.. పట్టించుకోండి..

- ప్రమాదకరంగా మైనింగ్ గుంతలు



పిడుగురాళ్ల: మైనింగ్ ప్రాంతంలోని లోతైన క్వారీ గుంతలు

పిడుగురాళ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో సరదాగా గడిపేందుకు కళాశాల, పాఠశాల విద్యార్థులు కొంత ఆసక్తిని కనబరుస్తుంటారు. ఈ క్రమంలో ప్రమాదకర రీతిలో ఆటలాడి ప్రాణాలు పోగొట్టుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. నెల రోజుల క్రితం రాజుపాలెం మండలం నెమలిపురికి చెందిన హర్షతుల్లా ఉగాది సెలవులకు వచ్చి బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. వారం రోజుల క్రితం మాచవరం మండలం కొత్తపాలెంలో దిగుడుబావిలో ఈతకొట్టేందుకు దిగి ఇద్దరు విద్యార్థులు చనిపోయారు. నాలుగేళ్ల క్రితం తుమ్మలచెరువు హైస్కూల్ సమీపంలో వైసీపీ నేతలు వాగులో ఇసుక తీయడం వల్ల ఏర్పడిన గుంతలలో ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. దాచేపల్లి మండలంలో వైసీపీ నేతలు చేసిన అక్రమ మైనింగ్‌తో ఏర్పడిన గుంతలలో భారీగా నీరుచేరి నలుగురు విద్యార్థులు మృతి చెందారు. ఎంతో ఉజ్వల భవిష్యత్‌వున్న చిన్నారులు ఈత సరదా కోసం లోతు తెలియక వాగులు, క్వారీ గుంతల్లోకి దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నా సంబంధిత మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు ఎటువంటి రక్షణ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. వాడుకలో లేని లోతైన ప్రదేశాలు వున్న క్వారీ గుంతల చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్న మైనింగ్ నిబంధనలు ఇక్కడ ఎవరికీ పట్టడం లేదు.



వాగులో ఈత కొడుతున్న విద్యార్థులు

ప్రమాదకర ప్రాంతాలు ఎక్కడంటే

ఎర్రవాగు, బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్, పెద అగ్రహారం, బ్రాహ్మణపల్లి, చినఅగ్రహారం గ్రామాలలోని పొలాల్లో నేలబావులు, స్వర్ణపిచ్చయ్య క్వారీ, గురవారెడ్డి క్వారీలలో లోతైన గుంతలు వున్న ప్రదేశాలు.

వేసవి కాలంలో పిడుగురాళ్ల సమీపంలోని మేజర్, మైనర్ కాల్వలు మరో వారం పది రోజులలో పూర్తిగా నీటి నిలిపివేతతో విద్యార్థులు ఈతకొట్టేందుకు అవకాశం ఉండదు. దీంతో సమీపంలో ఉన్న క్వారీ గుంతలలో ఈత కొట్టేందుకు మొగ్గు చూపుతుంటారు. ఇంట్లో ఎవరికి చెప్పకుండా స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లి లోతు తెలియక, ఈత రాక భయంతో ఊపిరి ఆడక విద్యార్థులు మృత్యువాత పడే అవకాశం వుంది. క్వారీ ప్రాంతాలలోని గుంతలు వందల అడుగుల లోతు వుండటం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే వెతికేందుకు గజ ఈతగాళ్లు రావాల్సిన పరిస్థితి ఉంది.

ఏషియన్ కప్‌లో మహిళా లిఫ్టర్లకు పతకాలు

మంగళగిరి సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరుగుతున్న ఏషియన్ యూనివర్సిటీ కప్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన మహిళా లిఫ్టర్లు అద్భుత ప్రతిభ కనబర్చి పలు పతకాలను సొంతం చేసుకున్నారని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని సోమవారం తెలియజేశారు.



పతకాలు సాధించిన మహిళా లిఫ్టర్లతో సంధాని, కోటేశ్వరరావు

47 కిలోల విభాగంలో మదిర షానూన్, 84 కిలోల విభాగంలో షేక్ షబీనా, 84 కిలోలు పైబడిన విభాగంలో నాగం జ్ఞానదివ్యలు స్క్వాట్, బెంచిప్రెస్, డెడ్‌లిఫ్ట్‌లో బంగారు పతకాలతోపాటు ఓవరాల్‌గా బంగారు పతకాలను సొంతం చేసుకున్నారని వెల్లడించారు. ఏషియన్ యూనివర్సిటీ కప్ ఎక్విప్డ్ అండ్ క్లాసిక్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్‌లో కేఎల్ యూనివర్సిటీ జట్టు చాంపియన్‌షిప్, క్లాసిక్‌లో ద్వితీయ స్థానం, ఎక్విప్డ్‌లో తృతీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన లిఫ్టర్లను కేఎల్‌యూ యాజమాన్యం, ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ కాకర్ల హరికిషోర్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్‌చైర్మన్ ఆర్ఎస్ వంశీకృష్ణ, సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, ఏపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, సకల సూర్యనారాయణ తదితరులు అభినందించారు.

ఏపీ ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు రేపటితో ఆఖరు

◆ అపరాధ రుసుంతో జూన్ 3 వరకు అవకాశం

పెదకాకాని, మే 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎడ్‌సెట్ -2025 దరఖాస్తుకు ఈ నెల 14న బుధవారంతో గడువు ముగుస్తుందని ఏపీ ఎడ్‌సెట్ రాష్ట్ర కన్వీనర్ ఆచార్య ఏవీపీఎస్ స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1000 అపరాధ రుసుంతో ఈ నెల 19, రూ.2వేలతో 24వ తేదీ వరకు, రూ.4వేలతో 26వ తేదీ వరకు, రూ.10 వేల అపరాధ రుసుంతో మే 27 నుండి జూన్ 3 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. మే 30 నుండి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. జూన్ 5న మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

16 నుంచి ఆహ్వాన నాటిక పోటీలు

చిలకలూరిపేట, మే12 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీఆర్ క్లబ్, కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో తెలుగు రాష్ట్రాల స్థాయిలో 9వ ఆహ్వాన నాటిక పోటీలు స్థానిక సీఆర్ క్లబ్ ఓపెన్ థియేటర్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు నాటిక పోటీలను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారన్నారు. హైదరాబాద్ కళాంజలి వారి రైతే రాజు, చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్ వారి మా ఇంట్లో మహాభారతం, హైదరాబాద్ యువభేరి థియేటర్స్ వారి నా శత్రువు నాటికల ప్రదర్శన జరుగుతుందన్నారు. 17న హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారి ఇది రహదారి కాదు, కరీంనగర్ కళాభారతి వారి చీకటిపువ్వు, విశాఖపట్నం భద్రం ఫౌండేషన్ వారి దొందు దొందే, 18న గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారి చిరుగు మేఘం, చిలకలూరిపేట అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ వారి అలితో సరదాగా, గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ వారి నాన్నా నేనొచ్చేస్తా నాటికల ప్రదర్శన ఉంటుందన్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి


నృసింహుని జయంత్యుత్సవాల్లో పాల్గొన్న ఈవో రామకోటిరెడ్డి, అర్చకులు

ముగిసిన నృసింహుడి జయంతి ఉత్సవాలు

మంగళగిరి సిటీ, మే 12 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 7వ తేదీ నుంచి జరుగుతున్న నృసింహుని జయంతి (ఆవిర్భావ) ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం నర సింహ మూల మంత్ర హోమం, మహాపూర్ణాహుతి, శాంతి కల్యాణం, సాయంత్రం రాజాధిరాజ వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి స్వర్గీయ మాల్యవంతం లక్ష్మీనరసింహాచార్యులు, శేషమ్మ కుటుం బసభ్యులు శాశ్వత కైంకర్యపరులుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆల య ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అర్చక బృందం పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే కూటమి లక్ష్యం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్


మంత్రి నాదెండ్ల మనోహర్‌కు తమ సమస్యలు తెలుపుతున్న వృద్ధులు

కొల్లిపర, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద ప్రజలు దయనీయ పరిస్థితిలో ఉన్నారని, వారిని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర జనార్దనస్వామి ఆలయ సమీపంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. కార్యక్రమానికి తహసీల్దార్ సిద్ధార్థ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ప్రతి నెలా 9,600 మందికి రూ.40 కోట్లు పెన్షన్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రీవెన్స్‌కు సుమారు 500పైగా దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ప్రతి దరఖాస్తును వారంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఎక్కువగా రేషన్ కార్డులు కోసం అర్జీలు వచ్చాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 1.46 కోట్ల మందికి నూతనంగా రేషన్ కార్డులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ, సబ్ కలెక్టర్ సంజనాసిన్హా, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని అస్థిరపరిచే విధానాలకు స్వస్తిచెప్పాలి

● యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి



ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు(విద్య),మే 12(ఆంధ్రజ్యోతి): విద్యా రంగాన్ని అస్థిరప రిచే విధానాలకు స్వస్తి చెప్పాలని, లేకుంటే తీవ్ర ఆందోళన చేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి స్పష్టం చేశారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని, పాఠశాలల పునర్విభజన సక్రమంగా చేపట్టాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కుసుమకుమారి పాల్గొని, మాట్లాడుతూ గత, ప్రస్తుత ప్రభుత్వాలు రకరకాల పేర్లతో హడావుడిగా తీసుకు వచ్చిన +2 విధానం, 3, 4, 5 తరగతుల తరలింపు వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూపీ పాఠశాలలపై అనుసరిస్తున్న వైఖరి, ఉన్నత పాఠశాలల పట్ల అనుసరిస్తున్న విధానాలు గందరగోళానికి గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి చర్యల వల్ల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు బాట పట్టిస్తున్నారని తెలిపారు. యూటీఎఫ్ ప్రచుర ణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ జీవో నంబరు 117 వల్ల ప్రభుత్వం విద్యా రంగానికి తీవ్ర నష్టం కలిగించిందని విమర్శించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు పిల్లల నిష్పత్తి తగ్గించాలని డిమాండ్ చేశారు. బదిలీల ప్రమోషన్ల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 15న పాఠశాల కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని హెచ్చరించారు. కలెక్టర్, డీఈఓ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఎండి దౌలా, కార్యదర్శులు పాల్గొన్నారు.

కలెక్టర్ విధుల పర్యవేక్షణకు.. జేసీకి ఉత్తర్వులు

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వచ్చే నెల ఆరో తేదీ వరకు మిడ్ టర్మ్ కెరీర్ ట్రైనింగ్‌కు ముస్సోరిలోని ఐఏఎస్ అకాడమికి వెళ్లడంతో ఆమె విధులను పర్యవేక్షించాలని ప్రభుత్వం జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజకు ఆదేశాలు జారీ చేసింది. గతంలో కలెక్టర్ సెలవుపై వెళితే ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యేవి. ఎక్కువ రోజులు సెలవు పెడితే పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) ఇస్తూ జీవో విడుదల చేసేది. ఇటీవల కలెక్టర్ నాగలక్ష్మి విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు కూడా ఇన్‌చార్జిగా జేసీని నియమించింది. ఇప్పుడు ఇన్‌చార్జి/ఎఫ్ఏసీ కాకుండా కలెక్టర్ విధులను పర్యవేక్షించాలని ఉత్తర్వులు జారీ చేయడం రెవెన్యూలో చర్చనీయాంశంగా మారింది. ఇంచుమించుగా నెల పాటు శిక్షణ నిమిత్తం కలెక్టర్ వెళ్లారంటే ఖచ్చితంగా ఎఫ్ఏసీ ఉండాల్సిందే. లేకుంటే పరిపాలన పరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఏమి ఆలోచన చేసిందో ఏమో 'లుక్ ఆఫ్టర్ కలెక్టర్ డ్యూటీస్' అని మాత్రమే ఇచ్చినట్లు రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో స్పష్టత రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉన్నది.

కొన్ని నెలల నుంచి గుంటూరు జిల్లాకు కలెక్టర్‌గా పోస్టింగ్ కోసం పలువురు ఐఏఎస్ అధికారులు ప్రభుత్వస్థాయిలో ప్రయత్నాలు చేసుకొంటున్నట్లు సమాచారం. గతంలో పల్నాడు కలెక్టర్‌గా విధులు నిర్వహించి, కోర్టు ఆదేశాలతో తెలంగాణ క్యాడర్‌కు వెళ్లి మళ్లీ క్యాట్ ఉత్తర్వులతో ఆంధ్రప్రదేశ్ సర్వీసుకు వచ్చిన లోతేటి శివశంకర్ గుంటూరు కలెక్టర్‌గా పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నట్లు రెవెన్యూ వర్గాలు చర్చించుకొంటున్నాయి. 2014-19 మధ్యన గుంటూరు జేసీగా, ఏపీసీఆర్‌డీఏ కమిషనర్‌గా విధులు నిర్వహించిన చెరుకూరి శ్రీధర్ పేరు కూడా గుంటూరు కలెక్టర్ పోస్టింగ్ కోసం వినిపిస్తోంది. గతంలో జేసీగా విధులు నిర్వహించి ఇప్పుడు మానవ వనరుల శాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్న కృతిక శుక్లా పేరు కూడా ప్రస్తావనకు వస్తోంది. కలెక్టర్ నాగలక్ష్మిని బదిలీ చేస్తారానన్న చర్చ కూడా కొనసాగుతోంది.

సీఆర్డీఏ అధికారుల తీరుపై ఆగ్రహం

తుళ్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): 'చిరు వ్యాపారుల పైనా మీ ప్రతాపం..' అంటూ టీడీపీ నాయకులు, రైతులు సీఆర్డీఏ అధికారులపై సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. తుళ్లూరు అయ్యప్ప స్వామి ఆలయం ఎదురు ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన మూడు కుటుంబాలు బడ్డీ కొట్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాయి. ఆలయం స్థలంలో చిరు వ్యాపారులను ఖాళీ చేయించాలని అధికారులకు ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే వారు ఆర్‌అండబీ స్థలంలోనే ఉన్నారని ఇబ్బంది పెట్టొద్దంటూ టీడీపీ నాయకులు అధికారులకు సూచించారు. కానీ, అధికారులు ససేమిర అనడంతో.. తుళ్లూరు సీఆర్డీఏ ఆఫీసుకు రైతులు, టీడీపీ నాయకులు వెళ్లారు. తహసీల్దార్ రవిబాబుని కలసి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, రాష్ట్ర నాయకుడు దామినేని శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాటా అప్పారావు, రైతులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాపురం రెండో లైనుకు చెందిన అంతర్రాష్ట్ర దొంగ పులి రమేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రమేష్ ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పట్టాభిపురం ఎస్సై సుబ్బారావు, సిబ్బంది సోమవారం ఇంటిలో రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. రమేష్ పై ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లో 50కు పైగా దొంగతనాల కేసులు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. అదేవిధంగా పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉండగా, నగరంపాలెం పోలీస్‌స్టేషన్లో రౌడీషీట్ ఉందని చెప్పారు.

ఉర్దూ డీఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

గుంటూరు(విద్య),మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడప, కృష్ణ, గుంటూరు, బాపట్ల, విశాఖపట్నం, తూర్పుపశ్చిమ గోదావరి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఉర్దూ డీఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్, ఉర్దూ రేంజ్) పోస్టులు అర్హులైన వారితో భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాక్ కోరారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి విజయరామరాజుకు సోమవారం సచివాలయంలో సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఉర్దూ పాఠశాలల పర్యవేక్షణకు, విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉర్దూ ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉర్దూ డీఐలు ఎంతో దోహదపడతారని, పోస్టులు ఖాళీగా ఉన్నందున దశాబ్ద కాలంగా ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో నష్టపోయారని తెలిపారు. ఉర్దూ డీఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మన్నెయ్యకు 14 రోజుల రిమాండ్

● టీడీపీ కార్యాలయం దహనం కేసులో నిందితుడు

మాచర్లటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ ఊరిబండి మన్నెయ్యను మాచర్ల పోలీసులు సోమవారం పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. 2022 డిసెంబరు 16న పట్టణంలోని టీడీపీ కార్యాలయం దహనం కేసులో మన్నెయ్య ఏ-27 నిందితుడు. న్యాయాధికారి పి.ప్రశాంత్ నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించారు. ఇప్పటికే పలు కేసుల్లో మన్నెయ్య రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రిమాండ్ అనంతరం మాచర్ల పట్టణ ఎస్ఐ తురకా వెంకటరమణ మన్నెయ్యను రాజమండ్రి సెంట్రల్ జైల్‌కు తరలించారు.

త్రికోటేశ్వరస్వామి గిరిప్రదక్షిణలో వ్యక్తి మృతి


ఆసా ప్రసాదు (ఫైల్ ఫోటో)

నరసరావుపేట టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కోటప్ప కొండ త్రికోటేశ్వరుని గిరి ప్రదక్షిణలో సోమవారం అపశృతి చోటుచేసుకుంది. గిరిప్రదక్షిణ చేస్తూ చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నంకు చెందిన ఆసా ప్రసాదు(50) మార్గమధ్యలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సహచర భక్తు లు కాపాడటానికి ప్రయత్నించారు. 108 అంబులెన్స్ వచ్చేసరికే అతను మృతి చెందాడు. గుండెపోటు రావడంతో మృతిచెంది ఉంటాడని తోటి భక్తులు భావి స్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారని బంధువులు తెలిపారు. మద్దిరాల్లోని ఓ గ్రానేట్ కంపెనీలో పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రతి పౌర్ణమికి కో టప్పకొండ గిరిప్రదక్షిణకు వేలాదిమంది భక్తులు వస్తుంటారని, మార్గంలో వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి రహదారిపై ఉన్న మట్టి కొట్టుకుపోయింది. దీంతో రాళ్లు తేలి చెప్పులు లేకుండా నడిచే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎమ్మెల్యే ప్రత్తిపాటి సంతాపం

ప్రసాదు మృతదేహాన్ని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పురుషోత్తపట్నంలో సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. జనసేన నాయకుడు తోటరాజా రమేష్, టీడీపీ నాయకులు ఇనగంటి జగదీష్, పట్టణ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్, గట్టినేని రమేష్, తోట బ్రహ్మస్వాములు ఆయన వెంట ఉన్నారు.

వైసీపీ నాయకుడి బెదిరింపులపై ఎస్పీకి ఫిర్యాదు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మే,12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సానుభూతిపరుడు నుంచి ఎదురైన బెదిరింపులపై సోమవారం జిల్లా ఎస్పీకి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చేబ్రోలు పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలో కూరగాయల మార్కెట్ ఆశీలు వేలం పాట 2024-25కు చేబ్రోలుకు చెందిన వైసీపీ సానుభూతిపరుడు వేపూరి బసవపున్నయ్య రు.9 లక్షలకు దక్కించుకున్నాడు. అయితే అతను పంచాయతీకి నగదు జమ చేయకుండానే ఆశీలు వసూలుకు పాల్పడ్డాడు. పంచాయతీకి వేలంపాట నగదు చెల్లించాలని కార్యదర్శి శ్రీనివాసరావు పలుమార్లు బసవపున్నయ్యను కోరగా డబ్బులు చెల్లించనని, అవసరమైతే బదిలీ చేయిస్తానని హెచ్చరించారని ఫిర్యాదు పేర్కొన్నారు. మరోసారి నగదు చెల్లించాలని కోరితే అంతు చూస్తానని బెదిరించినట్లు కార్యదర్శి శ్రీనివాసరావు జిల్లా ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారు.

19 నుంచి పది సప్లిమెంటరీ హాల్ టికెట్లు

గుంటూరు (విద్య)మే 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుండి 28వ తేదీ వరకు నిర్వహించే పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లు వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన మిత్ర వాట్సాప్ నంబరు 95523 00009 ద్వారా పాఠశాల, విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జిల్లా నమోదు చేసి, లేదా బీఎస్ఈ.ఏపీ.జీవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

డైట్ సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు (విద్య) మే 12 (ఆంధ్రజ్యోతి): డైట్ సెట్ దరఖాస్తుకు ఈ నెల 20వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు డీఈఓ సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు ఎంపీడీవోలతో జడ్పీ సీఈవో సమీక్ష

గుంటూరు సిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీ వోలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జ్యోతి బసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కార్యాలయాల ఏవోలు కూడా పాల్గొనాలని అందులో పేర్కొన్నారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

● ముగ్గురు గుంటూరు జిల్లా వాసుల దుర్మరణం

బెంగళూరు, మే 12(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ నుంచి హొళల్కెరె వైపు వెళ్తున్న ఇన్నోవా కారును సోమవారం తెల్లవారుజామున ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో గుంటూరు జిల్లా వెంకటాపురానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. సునీత (34), శ్యాంబాబు (17), శివనాగలి (55) మృతి చెందిన వారిలో ఉన్నారు. వీరు గుంటూరు నుంచి శివమొగ్గకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. ప్రమాదంపై హొళల్కెరె పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 513.00 అడుగులు ఉంది. ఇది 136.81 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు పట్టణ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్

పిడుగురాళ్ల, మే 12(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పట్టణంలో జరుగుతున్న, జరగబోయే అభివృద్ధిపై మంగళవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక శుభమస్తు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అధ్యక్షతన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను తెలిపారు. పట్టణ అభివృద్ధికి వ్యాపారస్తులు, విద్యావంతులు, పలు వర్గాలతో నిర్వహించే సమీక్షలో విలువైన సలహాలను ఎమ్మెల్యే తీసుకోనున్నట్లు తెలిపారు.

అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు


ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, మే 12(ఆంధ్రజ్యోతి): టీడీపీకి అంకితభావంతో పనిచేసేవారికి నామినేటెడ్ పదవుల ద్వారా తగిన గుర్తింపును కూటమి ప్రభుత్వం కల్పించిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు నియోజక వర్గ టీడీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ టీడీపీకి నిబద్ధత, విశ్వాసం, సేవా దృక్పథంతో కృషిచేసిన వారికి నామినేటెడ్ పదవుల రూపంలో గౌరవం లభించిందన్నారు. రాష్ట్రంలో 22 కార్పొరేషన్‌లకు ఛైర్మన్‌లను ప్రకటించి అన్ని సామాజిక వర్గాలకు సముచిత న్యాయం కల్పించిందన్నారు. కష్టపడి పనిచేసేవారి సేవలకు నామినేటెడ్ పదవులు ఇవ్వటంపై పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందన్నారు. నామినేటెడ్ పదవులు పొందినవారిని ఎమ్మెల్యే అభినందించారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మ తల్లి వార్షికోత్సవం


అంకమ్మతల్లి అమ్మవారిని అలంకరించిన దృశ్యం

పెదకూరపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్ళూరులో అంకమ్మ తల్లి దేవాలయ వార్షిక పూజలను సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా మహిళలు అమ్మవారికి జలబిందెలతో అభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు సామూహిక పొంగళ్ళు చేసి మహానివేదన చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అంకమ్మ తల్లి అమ్మవారి ప్రభను గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ఆధార్ సేవలను వినియోగించుకోవాలి

మాచవరం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లుట్ల, మాచవరం, మోర్జంపాడు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు 13, 14, 15 తేదీల్లో ఏర్పాటు చేయటం జరిగిందని, ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని ఎంపీడీవో కోరారు. చిన్న పిల్లలకు కొత్త కార్డులు, పెద్ద వారికి చేర్పులు, మార్పులు చేసుకొనే అవకాశం కల్పించారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలన్నారు.

భక్త మార్కండేయ నిత్యాన్నదాన సత్ర ఉపాధ్యక్షుడిగా ముస్యం శ్రీను


ముస్యం శ్రీనివాసరావు

దాచేపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): అఖిల భారత భక్త మార్కండేయ నిత్యాన్నదాన సత్ర నూతన కమిటీలో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉన్న అన్నదాన సత్రానికి ఉపాధ్యక్షుడిగా దాచేపల్లికి చెందిన ముస్యం శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్త మార్కండేయ నిత్యాన్నదాన కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది.

టీడీపీ మండల కార్యకర్తల సమావేశం

దాచేపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంలో టీడీపీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. మండల కన్వీనర్ బెల్లంకొండ బద్రి అధ్యక్షతన జరిగిన సమావేశానికి మండల పార్టీ నాయకులందరూ హాజరయ్యారు. త్వరలో దాచేపల్లి మండల అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన పదవులు కేటాయించనున్నారు. ఇందులో భాగంగా ఆసక్తి గలవారి పేర్లను సేకరించారు. దాచేపల్లి కమిటీ సేకరించిన పేర్ల వివరాలు పార్టీ అధినాయకత్వానికి అందజేస్తారు. అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యంతో పదవులు ఇచ్చేందుకు కార్యక్రమం ఏర్పాటుచేశారు.

వివాహిత ఆత్మహత్య

దాచేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామానికి చెందిన షేక్ ఆస్మా(22) కుటుంబ కలహాలతో తన ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి 6, 4 సంవత్సరాల వయసుగల పిల్లలు ఉన్నారు. భర్త షేక్ సైదా వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గోశాలకు రూ.50వేల విరాళం

పిడుగురాళ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాశక్తినగర్ సమీపంలో నిర్మాణంలో వున్న శ్రీ నందగోపాల ట్రస్టు అభివృద్ధికి రూ.50వేల విరాళాన్ని పట్టణానికి చెందిన కందుల శ్రీనివాసరావు అందజేశారు. గోశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ట్రస్టు సభ్యులకు శ్రీనివాసరావు తెలిపారు.

శివాలయంలో పౌర్ణమి పూజలు

పిడుగురాళ్ల, మే 12(ఆంధ్రజ్యోతి): వైశాఖమాసం పౌర్ణమి సందర్భంగా చినఅగ్రహారంలో ఉన్న శ్రీగంగాపార్వతి సమేత చంద్రమౌళేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారికి సోమవారం తెల్లవారు జా మునుండే రుద్రాబిషేకం, పార్వతిదేవికి మహాస్నపన, కుంకుమార్చన, దూపదీప నివేదన కార్యక్రమాలను ఆలయ అనువంశిక అర్చకస్వామి వెల్లటూరి చంద్రశేఖరశర్మ నిర్వహించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

మాచవరం, మే 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మాచవరంలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. పుణ్య దంపతులు పీటల మీద కూర్చొని 40వ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారిని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.


మాచవరంలో వేంకటేశ్వర కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వెల్లువెత్తిన ప్రజా సమస్యలు

● ప్రజాసమస్యల పరిష్కారవేదికలో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే, కలెక్టర్


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు

మాచర్లటౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గ పరిధిలో కారంపూడి, దుర్గి, మాచర్ల రూరల్, వెల్దుర్తి, రెంటచింతల మండలాల నుంచి ప్రజా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సోమవారం పట్టణంలోని వీవీఎన్ గార్డెన్స్‌లో నియోజకవర్గస్థాయి ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గత ప్రభుత్వంలో జరిగిన భూదందాలు, కబ్జాలు, సామాజిక పింఛన్లు, రైతాంగ సమస్యలపై అధిక మొత్తంలో ఫిర్యాదులు అధికారులకు చేరాయి. మొత్తంగా 452 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూజర్ ధనుంజయగనోరె, డీఆర్వో మురళీకృష్ణ, గురజాల ఆర్డీవో మురళీ, డీఎల్‌ఫవో కృష్ణప్రియ, మున్సిపల్ ఛైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, కమిషనర్ వేణుబాబు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్, స్పెషలాఫీసర్ గబ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నా భూమిని పిన్నెల్లి అనుచరులు కొట్టేశారు..

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అండతో అతని అనుచరులు తనను బెదిరించి తన 1.50 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని రాయవరానికి చెదిన రామిశెట్టి లక్ష్మీనరసమ్మ వాపోయింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చి ఎమ్మెల్యే, కలెక్టర్‌లను కలిసి అర్జీ అందించింది. అలాగే 30 ఏళ్లుగా తన ఆధీనంలో ఉన్న రెండున్నర ఎకరాల భూమిలో హైమావతి అనే మహిళ తమ ప్రమేయం లేకుండా ఎకరన్నర భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకుంది.. దీనిపై నిలదీస్తే మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి, ఆయన అనుచరులు ఫోన్ ద్వారా చంపుతాం అంటూ బెదిరిస్తున్నారని, నా భూమిని నాకిప్పించండంటూ ఆమె వేడుకుంది. నాకు సదరన్ సర్టిఫికెట్ కోసం అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని దుర్గి మండలం కంచరకుంట శివారు గ్రామం మంగాపురంతండాకు చెందిన కేతావత్ రవినాయక్ ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకున్నారు. తన ఇల్లు కాలిపోయి అందులో సదరన్ సర్టిఫికెట్ కాలిపోయిందని, వచ్చే నెల నుంచి అది లేకపోతే అధికారులు పింఛన్ ఇవ్వనన్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పెన్షన్ ఆగకుండా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ట్రైసైకిల్ కావాలని కోరగా అప్పటికప్పుడు నూతన ట్రైసైకిల్‌ను తెప్పించి రవినాయక్‌కు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

నియోజకవర్గంలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు వేసవిలో పచ్చిరొట్టకు బదులుగా దుక్కుల్లో వినియోగించే 30 రకాల ధాన్యాలతో కూడిన కిట్లను కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి అందజేశారు. అలాగే ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు పీజీఎస్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన పరిచేలా నియోజకవర్గంలో ఒక వ్యవసాయ క్షేత్రాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి, మాస్టర్ ట్రైనర్ వినోదా, సిబ్బంది పాల్గొన్నారు.


ధాన్యాల కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి, కలెక్టర్


న్యాయాధికారి ప్రవల్లికను కలిసిన న్యాయవాదులు

న్యాయాధికారిగా ప్రవల్లిక బాధ్యతల స్వీకారం

పిడుగురాళ్ల, మే 12(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా టి.ప్రవల్లిక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి కోపూరి వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది దారా చెన్నయ్య, మెరుగుమళ్ల శ్రీనివాసరావు, కేవీఎస్ కోటేశ్వరరావు, వై.వెంకటేశ్వర్లు తదితరులు న్యాయాధికారి ప్రవల్లికను మర్యాదపూర్వకంగా కలిశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 12(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 22.72 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

భూ సమీకరణ జరిగే గ్రామాలలో మట్టి తవ్వకాలు నిషేధం

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతి నిర్మాణానికి మండల పరిధిలో భూ సమీకరణ జరిగేందుకు గ్రామసభలు నిర్వహించిన గ్రామాలలో అక్రమ మట్టి తవ్వకాలు నిషేధించడం జరిగిందని తహసీల్దార్ డానియేలు తెలిపారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వైకుంఠపురం, పెదమద్దూరు, చావపాడు, ఎండ్రాయి, కర్లపూడి, లేమల్లె గ్రామాల చెరువులలో మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ప్రజలకు తాగునీరందించటమే లక్ష్యం

పెదకూరపాడు, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించటమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అన్నారు. మండలంలోని ముస్సాపురంలో శిథిలావస్థకు చేరిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచనలతో మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు, మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ మరమ్మతులు నిర్వహించి తాగునీటిని అందించేలా ఏర్పాట్లుచేశారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

క్రోసూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరులో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను సోమవారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. మొత్తం 50 జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో మాజీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు దాచేపల్లి సైదా, మొగల్ జాన్, వెంకటేశ్వరరెడ్డి, విష్ణుమూర్తి, బత్తుల హనుమంతరావు, రాణా హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు. పోటీలకు స్థానిక క్రీడాకారులు ఆధ్వర్యం వహిస్తున్నట్టు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కన్నా


నకరికల్లులో శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, మే 12(ఆంధ్రజ్యోతి): నకరికల్లులోని కొండపై కొలువై ఉన్న ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ళను పురస్కరించుకొని కన్నా భక్తులకు స్వయంగా వడ్డించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు నాగోతు శౌరయ్య, తిరుమలశెట్టి వెంకటరావు, కిషోర్, సుబ్బయ్య, కాశి, ఆలయ ఈవో వై వెంకయ్య, చుండు గోవర్ధనరావు తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత

సత్తెనపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): మృతిచెందిన సత్తెనపల్లి రూరల్ మండలం రెంటపాళ్ళకు చెందిన కొల్లి లక్ష్మయ్య, నకరికల్లుకు చెందిన ఎస్ ఏడుకొండలు కుటుంబసభ్యులకు టీడీపీ కార్యాలయం నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కులను సోమవారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అందించారు. మృతులు ఇరువురికి టీడీపీ సభ్యత్వం ఉండటంతో టీడీపీ ద్వారా మంజూరైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం కలిగిన ప్రతి కార్యకర్త కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. మార్కెట్ యార్డు కమిటీ మాజీ ఛైర్మన్ మక్కపాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

వైభవంగా మట్టపల్లి లక్ష్మీనరసింహుని కల్యాణం


గరుడవాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

దాచేపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణా, ఆంధ్రా ప్రజల ఆరాధ్య దైవం మట్టపల్లి శ్రీలక్ష్మీనారసింహస్వామి కల్యాణాన్ని తిలకించేందుకు విశేషంగా భక్తులు తరలివచ్చారు. ఏటా వైశాఖపౌర్ణమినాడు మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మి సమేతుడైన నరసింహ స్వామి కల్యాణోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. వ్యాఖ్యాతగా సోమయాజుల సూర్యనారాయణ శర్మ వ్యవహరించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు కృష్ణానదిలో స్నానాలు ఆచరించి రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మి సమేతుడైన నరసింహ స్వామిని దర్శించుకున్నారు. నాలుగు మాడవీధుల్లో నారసింహుడు గరుడవాహనంపై ఊరేగింపుగా తరలివచ్చారు. సత్రాల్లో అన్నదానం, దేవస్థానంలో భక్తలకు అన్న ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త, దేవస్థాన ఛైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయకుమార్, ఆలయ ఈవో సిరికొండ నవీన్ ఉత్సవాలను పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ బందోబస్తు నిర్వహించింది.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారుల విస్తృత దాడులు

● రూ 2.53 లక్షల అపరాధ రుసుం విధించినట్టు వెల్లడి


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు

క్రోసూరు, మే 12(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారు లు విస్తృతంగా దాడులు నిర్వహించారు. అక్రమాలకు పాల్పడుతున్న వారికి రూ 2.53లక్షల అపరాధరుసుం విధించినట్టు వారు విలేకరులకు తెలిపారు. మీటరు లేకుండా విద్యుత్‌చౌర్యానికి పాల్పడుతున్న 12 మందికి రూ.24వేలు, అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్న నలుగురికి రూ.22వేలు, ఇతర క్యాటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఐదుగురికి రూ.13వేలు, అధిక లోడు వాడుకుంటున్న 84మందికి రూ.1.90లక్షల జరిమానాలు విధించినట్టు తెలిపారు. క్రోసూరు, అందుకూరు, వీసపాడు, గుడిపాడు, బయ్యవ రం, విప్పర్ల, నాగవరం, గరికపాడు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్టు బృందానికి నాయకత్వం వహించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకటేశ్వరరావు, రాంబొట్లు తెలిపారు. మొత్తం తనిఖీల్లో 39మంది అధికారులు, 114 మంది సిబ్బంది 39 బృందాలుగా ఏర్పడి 2500 సర్వీసులు తనిఖీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండాలని, సీలు ఊడిపోయిన, లేకపోయినా అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అపరాధరుసుం చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ యాక్టు కింద ఆస్తులు జప్తు చేస్తామన్నారు. విద్యుత్‌చౌర్యం సామాజిక నేరంగా పరిగణించాలన్నారు. దాడుల్లో డివిజనల్ ఇంజనీర్లు రవికుమార్, మల్లికార్జున ప్రసాదు, రాజశేఖరబాబు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

30 రకాల విత్తనాలతో అనేక లాభాలు: డీపీఎం


రైతులతో మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

వెల్దుర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి): 30 రకాల విత్తనాలతో అనేక రకాల లాభాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం అమలకుమారి అన్నారు. సోమవారం మండలంలోని మండాదిలో అనంత వెంకటరెడ్డి అనే రైతు పొలంలో 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ (ప్రీమాన్‌సూన్ డ్రై సోయింగ్) వేశారు. ఈ సందర్భంగా అమలకుమారి రైతులతో మాట్లాడుతూ రైతులు పీఎండీఎస్ విత్తనాలు వేసుకోవడం వలన భూమిలో కర్బన శాతం పెరిగి అధిక లాభాలను పొందవచ్చన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, ఎన్ఎఫ్ఏ మేరి, వినోద పాల్గొన్నారు.

రెజ్లింగ్ జిల్లా జట్టు ఎంపిక

అచ్చంపేట, మే 12(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా అమెచ్యూర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు జరిగినట్టు జిల్లా కార్యదర్శి గుడిపూడి భూషణం తెలిపారు. పల్నాడు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి అండర్ 17, 23 బాల బాలికల ఎంపికలు జరిగాయి. అండర్-17 బాలుర విభాగంలో పీ అంజీ నాయక్(కారంపూడి), కే బుజ్జిబాబు(ఉప్పలపాడు), కే గోపయ్య(అచ్చంపేట), ఎన్ బాబు(గోరంట్ల), కేవీఎల్ చక్రధర్(వీపీ సౌత్), ఎం వరప్రసాదు(చిగురుపాడు), కే నంద కిషోర్(వైకుంఠపురం), ఎస్ మోజెస్(అచ్చంపేట), ఎం వెంకటేష్(88 తాళ్ళూరు), ఎం హేమంత్ వెంకటేష్(ఉప్పలపాడు), వీ పృథ్వీ(చౌటపాపాయపాలెం), వీ చరణ్(ఫణిదం), డీ కుమార్‌బాబు(లగడపాడు), ఎం రాజకుమార్(ఉప్పలపాడు), అండర్ - 17 బాలికల విభాగంలో ఈ లాత్య(రెంటపాళ్ళ), ఆర్ గాయత్రి బాయి(వీపీ సౌత్), ఆర్ అనూష(అడిగొప్పుల), డీ నేహశ్రీ(బ్రాహ్మణకోడూరు), అండర్ - 23 బాలుర విభాగంలో కే లూలునాయక్(శ్రీరామాంజనేయపురం తండా), ఆర్ శ్రీహరి(అనంతవరం), కే కిరణ్‌కుమార్(చల్లగరిగ), బీ తేజ(కొచ్చర్ల), వై మల్లిఖార్జున(లోయపల్లి), ఎస్ బాలకోటేశ్వరరావు(పిడుగురాళ్ళ), అండర్ - 23 బాలికల విభాగంలో పీ ధనేకుల బాయి(వీపీ సౌత్) వీ నితీష(రెంటపాళ్ళ)లు ఎంపికయ్యారు. ఎంపికైనవారు ఈనెల 16, 17, 18 తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్నట్టు భూషణం తెలిపారు.


రాష్ట్ర స్థాయికి ఎంపికైన రెజ్లింగ్ క్రీడాకారులు


మల్లవరంలో కుళాయి ద్వారా వృథాగా పోతున్న నీరు

తాగునీటి వృథా..

రెంటచింతల, మే 12 (ఆంధ్రజ్యోతి): అసలే వేసవికాలం.. తాగునీటి అవసరాలు తీర్చడం ఖర్చుతో కూడుకున్నది.. కానీ మండలంలోని మల్లవరం గ్రామంలో కుళాయిల ద్వారా వృథాగా పోతున్న నీరే అధికం. చాలా కుళాయిల దగ్గర ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీ ద్వారా సరఫరా అవుతున్న నీటి కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడమే దీనికి కారణం. కుళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేసి పంచాయతీ అధికారులు నీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనాఉంది.


గురజాల నియోజకవర్గ సమీక్ష ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ మురళీ తదితరులు

సమీక్ష ఏర్పాట్ల పరిశీలన

పిడుగురాళ్ల, మే 12(ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో ఈ నెల 15న పిడుగురాళ్ల మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగనున్న సమీక్ష ఏర్పాట్లను సోమవారం డీఆర్‌ఓ మురళీ పరిశీలించారు. జడ్పీ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్, మధ్యాహ్నం మార్కెట్ యార్డులో సమీక్ష ఏర్పాట్లను డీఆర్‌ఓ పరిశీలించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.మధుబాబు, మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్, డీఈ శ్రీనివాసరావు, ఎస్‌హెచ్‌ఓ వెంకట్రావు, డీటీ శర్మ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


పంచాయతీ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న పల్నాడు జిల్లా భూరక్షా విభాగ్ సభ్యుడు తుమ్మా మర్రెడ్డి

గోవధ నిషేధ చట్టం అమలుచేయాలి

అచ్చంపేట, మే 12(ఆంధ్రజ్యోతి): గోవధ నిషేధ చట్టం పకడ్బందీగా అమలు జరపాలని విశ్వ హిందూ పరిషత్‌కు చెందిన గోరక్ష విభాగ్ సభ్యులు, పల్నాడు జిల్లా ప్రముఖ్ తుమ్మా మర్రెడ్డి పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందించారు. వ్యవసాయానికి ఉపయోగించే జంతువులను మాంసానికి ఉపయోగించటం తగదన్నారు. ఆవులు, గేదెలు, ఎద్దులు, కోడెల అమ్మకాలు జరపకుండా గ్రామస్థులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర గోరక్ష సహ ప్రముఖ్ మన్నవ చలపతిరావు, భాగావతుల రవికుమార్, ఏలూరి బాలస్వామి, తిరుపతి స్వామి, కడగండ్ల లక్ష్మణాచారి తదితర బీజేపీ నాయకులు ఉన్నారు.

లక్ష్మీ నరసింహుని కల్యాణంలో ఎమ్మెల్యే జూలకంటి

కారంపూడి, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసన్నిగండ్లలో కొలువుదీరిన సింగరుట్ల శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త గుండాల శ్రీనివాసరావు, ఈవో నాగిరెడ్డి, టీడీపీ నేతలు చప్పిడి రాము, గాడిపర్తి పూర్ణయ్య, జనసేన నేత రామాంజినేయులు, కొర్రపాటి ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం

మాచర్ల రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కృష్ణానది తీరాన కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం ఆలయ ధర్మకర్త రాయప్రోలు సుబ్రహ్మణ్య సరస్వతిశర్మ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యహవచనం, అంకురార్పణ, నవగ్రహ ఆరాధన, మండల ఆరాధన తదితర పూజలు జరిపారు. అనంతరం స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. గోవవరపు సుబ్బారావు సహకారంతో 6వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ నేత కొల్లూరి వెంకట్రామయ్య ఆధ్వర్యాన భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ సూపరింటెండెంట్ దిపేందర్‌బోయి, డీఈ శివకుమార్, క్యూరేటర్ కమలహాసన్, సీఏ వెంకటయ్య, టీడీపీ నేత బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, పర్వతాలు, వట్టికొండ జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట ఎంపీ చొరవతో పల్లెలకు మహర్దశ

కారంపూడి, మే 12 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ, టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు చొరవతో పల్నాడు గ్రామాల్లోని డొంకలు, పొలాలు, రోడ్లు అభివృద్ధి బాట పట్టాయని టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ జాస్తి గంగారావు అన్నారు. సోమవారం కాకానివారిపాలెంలో 3 కి.మీ.ల మేర రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభం కాగా వాటిని పర్యవేక్షించారు. తరచూ రైతులు, గ్రామస్తుల నుంచి వస్తున్న అభ్యర్థనల మేరకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సోమవారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంపీ తన సొంత నిధులతో మిషనరీ పంపిస్తే గ్రామ నాయకులు, రైతులు ఆయిల్, గ్రావెల్ సేకరించి పనులు చేయించుకుంటున్నారు.

రోగులకు సేవలో నర్సుల పాత్ర వెలకట్టలేనిది


రెంటచింతల, మే 12 (ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్య సేవల్లో కొండంత ధైర్యాన్ని నింపడంలో నర్సుల పాత్ర కీలకమని.. వారి సేవలకు వెలకట్టలేమని పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.కృష్ణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నర్సులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమ, సూపర్‌వైజర్లు కోటేశ్వరరావు, ఆంజనేయులు, నిర్మల, లక్ష్మీ ప్రసన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు

అమరావతి, మే 12(ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుని జీవిత ఘట్టంలో ప్రధాన అంశాలైన జననం, జ్ఞానం, నిర్యాణం వైశాఖ పౌర్ణమి రోజునే కావడం విశేషం. ఆ పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన అమరావతిలోని మహాచైత్యం వద్ద ధాన్యకటక బుద్ధ విహార ట్రస్టు ఆధ్వర్యంలో 2569వ బుద్ధ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుద్ధ ధాతువులపై నిర్మించిన మహాచైత్యం వద్ద పూజలు నిర్వహించారు. సాయంత్రం యోగాశ్రమంలో బౌద్ధ ధర్మ సందేశం, గోడపై చిత్రాల ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు వావిలాల సుబ్బారావు, ఉపసర్పంచ్ నిమ్మా విజయ సాగరబాబు, కె.వెంకటేశ్వరరావు, కోనూరు అప్పారావు, ప్రపుల్లా రాణీ, గిరి స్వామి, బి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


మహాచైత్యం వద్ద పూజలు నిర్వహిస్తున్న ధాన్యకటక బుద్ధవిహార ట్రస్టు సభ్యులు

కొండవీడు అభివృద్ధిపై కినుక


కొండవీడుకోట ఏరియల్ వ్యూ

కొండవీడు అభివృద్ధికి టీడీపీ కృషి

యడ్లపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): చారిత్రక, ఆధ్యాత్మిక నేపథ్యం కలిగిన కొండవీడుకోట అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఘాట్ రోడ్డు, మెట్ల మార్గం పునరుద్ధరణ, ఇతర మౌలిక సదుపాయాలు మినహా ఇక్కడ ఎలాంటి అభివృద్ధి ఆనవాళ్లు అగుపించడం లేదు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా కొండవీడును తీర్చిదిద్దుతామన్న నేతల మాటలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయి. గత బడ్జెట్ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొండవీడు కోట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పర్యాటకశాఖ మంత్రిని కోరారు. కేంద్రమంత్రి పెమ్మసాని, ఎంపీ లావుకు కేంద్రం నుంచి నిధులు కేటాయించేలా కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. నేటికీ ఈ ప్రాంత అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

రెడ్డిరాజులు 14వ శతాబ్దం ప్రారంభంలో శత్రుదుర్భేద్యమైన కొండవీడుకోటను నిర్మించారు. కోట రక్షణ వ్యవస్థలో భాగంగా కొండల శిఖరాలపై 24 బురుజులు నిర్మించి, ఒకదానితో ఒకటి కలుపుతూ 20 కి.మీల మేర రాతిగోడను నిర్మించారు. వీటితోపాటు కోటలో అనేక దేవాలయాలు, మండపాలు, నీటి వసతి కోసం గొలుసుకట్లు చెరువులు, నేతి కొట్టు, బుంగబావి, నీటి బావులు, నాలుగు వైపులా ప్రవేశకోసం ముఖద్వారాలు నిర్మించారు. వీటిలో చాలా నిర్మాణాలు శిథిలావస్తకు చేరి కొన్ని రూపురేఖలు కోల్పోయి నామ మాత్రంగా దర్శనమిస్తున్నాయి. 2014లో టీడీపీ ప్రభుత్వం కొండవీడు ప్రాంత అభివృద్ధికి విశేష కృషిచేసింది. అప్పటి మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఈ ప్రాంత అభివృద్ధికి విశేష కృషిచేశారు. పర్యాటకులు కొండవీడు కోటకు చేరుకునేందుకు వీలుగా ఘాట్ రోడ్డు నిర్మాణం, కోట వైపు నుంచి పురాతన మెట్లమార్గం, రాతి గోడ, ముఖ ద్వారాల పునరుద్ధరణ, శిథిలమైన దేవాలయాలు, మండపాల జీర్ణోద్ధరణ, కొండలపై ఉన్న వెదుళ్ల ముత్యాలమ్మ, పుట్టాలమ్మ చెరువులను అభివృద్ధి చేశారు. కోట గ్రామంలోని కత్తుల బావిగా పిలువబడే వేణుగోపాల స్వామి ఆలయం పునరుద్ధరణ చేసి, చిల్డ్రన్ పార్కు ఏర్పాటు వంటి అంశాలతో సమగ్రమైన డీపీఆర్‌ను రూపొందించారు. మ్యూజియం, వేద పాఠశాల, రిసార్ట్స్, ఔషధ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పురావస్తు, అటవీ, ఆర్‌అండ్‌బీ, పర్యాటక శాఖలను సమన్వయ పరుస్తూ కొండవీడు అభివృద్ధికి బాటలు వేశారు. ఐదేళ్ల సుమారు రూ.50కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపట్టారు. తొలిదశ 5.1 కిలోమీటర్ల ఘాట్ రోడ్డు, 1.5 కిలోమీటర్ల మెట్లమార్గం, కొండలపై ఉన్న మూడు చెరువుల అభివృద్ధి, నరసింహస్వామి దేవాలయం పునరుద్ధరణ పనులు 70శాతం మేర పూర్తి చేసింది. రెండో దశ 650 మీటర్ల ఘాట్ రో డ్డు నిర్మాణానికి అనుమతులు తెచ్చి సుమారు రూ.11 కోట్లతో టెండర్లను పిలిచి పనులను అప్పగించింది.

- గత టీడీపీ ప్రభుత్వంలో వేగంగా పురోగతి
- వైసీపీ హయాంలో ప్రచార ఆర్భాటమే..
- కూటమి పాలనలో పరుగులందుకునేనా..
- పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా ప్రసిద్ధి
- అభివృద్ధి చేస్తే.. ప్రభుత్వానికి ఆదాయం.. ప్రజలకు వినోదం


పునరుద్ధరించాల్సిన కోట గ్రామంలోని కత్తులబావి


కొండవీడుకోట ఘాట్ మార్గం

ఆరంభంలోనే నిలిచిపోయిన శివాలయం

వైసీపీ ప్రభుత్వ హయాంలో

వైసీపీ ప్రభుత్వం కొండవీడు ప్రాంత అభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది. టీడీపీ ప్రభుత్వం రూ.200 కోట్లతో రూపొందించిన సమగ్రమైన డీపీఆర్‌ను ప్రక్కన పెట్టి రూ.13.25 కోట్లతో ఐదేళ్ల కాలానికి కొత్త డీపీఆర్‌ను రూపొందించింది. అయితే వీటిలో టీడీపీ హయాంలో 70 శాతం మేర పూర్తి చేసిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, 650 మీటర్ల రెండో దశ ఘాట్‌రోడ్డు నిర్మాణం మినహా ఎలాంటి పునరుద్ధరణ పనులను చేపట్టలేదు. రూ.85 లక్షల వ్యయంతో చేపట్టిన శివాలయం పునరుద్ధరణ పనులు పునాదిలోనే నిలిచిపోయింది. మరుగుదొడ్లు నిర్వహణ లేక మూలన పడ్డాయి. గతంలో సీఎం చంద్రబాబు సమయంలో ప్రపంచస్థాయి రిసార్ట్స్ నిర్మాణానికి గొల్కొండ సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి ముందుకు వచ్చారు. వచ్చిన వైసీపీ ప్రభుత్వం నుంచి ఆయనకు సరైన సహకారం లభించలేదు.

శాఖల సమన్వయ లోపం

ఎంతో ఉన్నతంగా ఊహించుకుని కొండవీడు కోటకు వస్తున్న పర్యాటకులకు సంతృప్తి లభించడం లేదు. వాస్తవంలో వారు ఊహించిన వాతావరణం ఇక్కడ కనిపించడం లేదు. దీనికి పురావస్తు, అటవీ, దేవదాయ, ఆర్‌అండ్‌బీ, పర్యాటకశాఖల మధ్య సమన్వయ లోపం, అధికారుల అలసత్వం ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

భద్రతకు ప్రాధాన్యం

కొండవీడుకోట సమగ్ర అభివృద్ధితో పాటు ఇక్కడకు వచ్చే సందర్శకుల భద్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఘాట్ మార్గంలో తరచూ కొండ చరియలు విరిగిపడుతున్నాయి. గతేడాది సెప్టెంబరులో కురిసిన వర్షాలకు భారీగా కొండ చరియలు విరిగిపడి నెల రోజుల పాటు ఘాట్ మార్గాన్ని మూసివేశారు. కొండ చరియలు జారిపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

చేయాల్సిన అభివృద్ధి పనులు

- యువతను ఆకర్షించే విధంగా సాహస క్రీడలు హార్స్ రైడింగ్, ట్రెక్కింగ్, రాఫ్టింగ్, బోటింగ్, ఏటీవీ వెహికల్ రైడింగ్, ఆర్చరీ వంటి వాటిని నిర్వహించాలి.
- కొండలపై చుట్టొచ్చే విధంగా రోప్‌వే నిర్మాణం చేయడం, చెరువుల్లో 365 రోజులూ నీటి స్థిరీకరణ చేయాలి.
- రెడ్డిరాజులు వసంత రుతువులో విదేశాల నుంచి ఖరీదైన సుగంధ ద్రవ్యాలను తెప్పించి వైభవంగా వసంతోత్సవం నిర్వహించేవారని, కర్పూర ఖండాలను ప్రజలపై చల్లేవారని ఖ్యాతి. ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకుని ఏటా వసంతోత్సవం, వేమన జయంతి ఉత్సవాలను నిర్వహిస్తే ఈ ప్రాంతానికి మరింత ప్రాచుర్యాన్ని తీసుకురావచ్చు.
- ప్రతిపాదన దశలో నిలిచిపోయిన ఎకో పార్కును పట్టాలెక్కించాలి. ఔషధ మొక్కలు విరివిగా ఉన్న ఈ ప్రాంతం మెడికల్ టూరిజంకు అవకాశాన్ని కల్పిస్తుంది. తరచూ కవితా గోష్టులను ఇక్కడ నిర్వహించడం వంటివి చేయాలి.
- ప్రణాళిక ప్రకారం వీటిని చేపట్టి నిర్వహిస్తే ఈ ప్రాంతం ఆధ్యాత్మిక, చారిత్రక పర్యాటక కేంద్రంగా విలసిల్లే అవకాశం ఉంది.

ఎట్టకేలకు.. యార్డు అభివృద్ధికి మోక్షం..!



వైసీపీ హయాంలో.. మరింత దారుణం

గత వైసీపీ హయాంలో తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డు ప్రాంగణంలో అభివృద్ధి పనులకు ముందుకు రాలేదు. పైగా ఏళ్ల తరబడి ఉన్న వివిధ వృక్షాలను నరికి, వాటి దుంగలను తరలించుకున్నారు. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తెనాలిలో రైతు భరోసా సభను పెట్టుకునేందుకు యార్డు ప్రాంగణాన్ని ఎంపిక చేశారు. ఆ సమయంలో యార్డు గోడను సైతం పగులగొట్టి.. కార్లు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. తిరిగి గోడను నిర్మించలేదు. మౌలిక వసతులు కల్పించకపోగా ఉన్న వాటిని కూడా ఈ విధంగా ధ్వంసం చేయడంతో రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ముఖ్యంగా అందరినీ ఆకర్షించేలా ఎడ్లబండితో రైతు పంటలను తీసుకువస్తున్న విగ్రహాలను యార్డు బయట ఏర్పాటు చేశారు. దీనిని చూసిన రైతులు లోపల సేవలు లేవు.. బయట ఆర్భాటం ఏంటో అంటూ నిష్ఠూర పోయారు.

- దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం
- మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పన
- తెనాలి యార్డులో రూ.1.40 కోట్లతో సీసీ రోడ్డు, మరుగుదొడ్లు
- వైసీపీ హయాంలో జగన్ సభకు చెట్లు, గోడల కూల్చివేత

తెనాలి రూరల్, మే12(ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు, ధాన్యం నిల్వచేసేందుకు తెనాలిలో ఏర్పాటు చేసిన వ్యవసాయమార్కెట్ యార్డులో ఎట్టకేలకు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో యార్డు అభివృద్ధి కుంటుపడింది. రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. నిమ్మ, ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు ఈ యార్డు పెట్టింది పేరు. తెనాలి, కొల్లిపర, చుండూరు, దుగ్గిరాల వంటి పలు ప్రాంతాల నుండి రైతులు నిమ్మకాయలను యార్డుకు తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతుంటారు. ఇక్కడి వివిధ రాష్ట్రాలకు ఎగుమతులవుతాయి. నిత్యం వందలాది మంది రైతులు వచ్చిపోయే మార్కెట్ యార్డు ప్రాంగణంలో కనీస మౌలిక వసతులు కూడా లేవంటే అతిశయోక్తి కాదు. ఇక్కడ మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేవు. దీంతో బహిరంగ ప్రదేశాలను ఆశ్రయించక తప్పట్లేదు. కూటమి ప్రభుత్వం కొలుదీరిన అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులలో ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టింది. అందులో భాగంగా తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా సిమెంట్ రోడ్లు, స్త్రీ, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణానికి సుమారు రూ1.40 కోట్లతో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం అవి నిర్మాణ దశలో ఉన్నాయి. అన్న క్యాంటిన్‌ను యార్డు ప్రాంగణంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చేవారు సైతం వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు.

ఇంకా చేయాల్సింది కొండంత..

తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో అభివృద్ధిపనులు మరిన్ని చేయాల్సి ఉంది. ఏళ్లనాడు కట్టిన గోడౌన్‌ల నిర్వహణలో లోపాలు అనేకమున్నాయి. గోడలకు రంగులు పోవడంతో పాటు పైకప్పులు సైతం అక్కడక్కడా దెబ్బతిన్నాయి. ఇక షెట్టర్లకు సకాలంలో గ్రీజు వంటివి పెట్టకపోవడం, ఏళ్ల నాటివి కావడంతో అవికూడా మార్చాల్సి ఉంది. గోడౌన్లకు ఉన్న కిటికీలు కూడా దెబ్బతిన్నాయి. భద్రపరిచిన ధాన్యాన్ని ఎలుకలు పాడుచేసే అవకాశం ఉంది. యార్డు చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉంది. వీటిపై కూడా ప్రభుత్వం దృష్టిపెడితే రైతాంగానికి ఎంతో మేలు కలుగుతుంది.


యార్డులో నూతనంగా సిమెంట్‌రోడ్లకు జరుగుతున్న పనులు


యార్డులో రైతులకు కోసం నిర్మిస్తున్న మరుగుదొడ్లు

ఉన్నతాధికారులకు నివేదిక

యార్డు కార్యదర్శి సుబ్బారావు



కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక యార్డుల్లో సమస్యలపై నివేదిక కోరింది. దీంతో సమస్యలను ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. త్వరలోనే పూర్తిస్థాయిలో యార్డును తీర్చిదిద్దుతామని తెనాలి యార్డు కార్యదర్శి సుబ్బారావు తెలిపారు.

ఉపాధి శ్రామికులకు బీమా భరోసా..!

- సహజ, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2లక్షల పరిహారం
- అంగీకార పత్రం అందిస్తే.. ప్రభుత్వమే నగదు చెల్లింపు
- పని ప్రదేశంలో భద్రతకు ప్రభుత్వాలు కృషి


ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు

నకరికల్లు, మే 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో కూటమి ప్రభుత్వం వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. ఉపాధి కల్పించడమే గాక, ఉపాధి పనులకు వెళ్లిన సమయంలో పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు శ్రామికులు చనిపోతే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధి శ్రామికుల జీవితాలకు భద్రత కల్పించాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సూచనలతో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశి భూషణ్ కుమార్ ఈ మేరకు జీవో విడుదల చేశారు. దీంతో రూ.50 వేలుగా ఉన్న పరిహారం.. రూ.2 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ప్రధాన మంత్రి సురక్షా బీమా..

ఉపాధి పనులకు వెళ్లిన శ్రామికులు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని అందిస్తుంది. వేతనంలో రూ.20లు చెల్లించమనే అంగీకార పత్రాన్ని ఉపాధి హామీ కార్యాలయంలో అందివ్వాలి. దీంతో శ్రామికుని పేరుతో ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన ద్వారా ప్రభుత్వమే బీమా నగదు రూ.20 చెల్లిస్తుంది. ఈ ప్రమాద బీమా 70 ఏళ్ల వయస్సు వరకు వర్తిస్తుంది.

ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా..

ఉపాధి పనులకు వెళ్లిన శ్రామికులు సహజ మరణం పొందినా, ప్రమాదవశాత్తు మరణించినా.. రూ.2 లక్షలు బీమా అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన ద్వారా రూ.430లు తనకు వచ్చే వేతనం నుంచి చెల్లించమని అంగీకార పత్రం శ్రామికులు ఉపాధి కార్యాలయంలో అందించాలి.

ఆర్థిక స్థితి కలిగిన వారు మాత్రమే పొందగలిగే బీమా పథకాలను ఉపాధి శ్రామికులకు ప్రభుత్వం కల్పిస్తోంది. దీంతో ఉపాధి శ్రామికులందరికీ బీమా రక్షణ కల్పిస్తోంది.

ఉపాధి కుటుంబాలకు బీమా రక్షణ



పల్నాడు జిల్లాలో 3.42 లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. 5.88 లక్షల మంది ఉపాధి శ్రామికులు ఉన్నారు. రూ.20 తో ప్రమాద బీమా, రూ.436 తో సాధారణ, ప్రమాద బీమాలు ఉపాధి శ్రామికులకు అందుబాటులో ఉన్నాయి.

-సిద్ధ లింగమూర్తి, పీడీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పల్నాడు







మండుటెండకు.. ముఖం చాటేస్తూ..!

భానుడి దెబ్బకు జనం బెంబేలెత్తిపోయారు. సోమవారం 44 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 7 గంటల నుంచే ఎండ ప్రభావం చూపింది. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన ప్రజలు ఉదయం 10 గంటల కల్లా ఇళ్లకు చేరుకున్నారు. కొన్ని రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎండ దెబ్బ తగలకుండా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తలకు తువ్వాలు, చేతి రుమాలు, చున్నీ రక్షణ కవచంలా ధరించారు. వాహనాలపై వెళ్లేవారు వేడి సెగ తాకకుండా ముఖాలను పూర్తిగా కప్పేసుకున్నారు.

-గుంటూరు, ఆంధ్రజ్యోతి

ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: సీఐ

నరసరావుపేట లీగల్, మే 12 (ఆంధ్రజ్యోతి): చర్చిలు, మసీదులు, దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నరసరావుపేట మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్ సోమవారం కోరారు. మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిందూ, ముస్లిం, క్రైస్తవ పెద్దలు, మందిరాల ఇన్చార్జిలతో మొదటి పట్టణ పోలీస్ స్టేషన్లో భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో పాల్గొన్న మత పెద్దలు ప్రార్థన స్థలాల బాధ్యులు కెమెరాల ఏర్పాటు నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలిపారు అవసరమైన సహకారాన్ని అందించేందుకు అంగీకరించినట్లు సీఐ చరణ్ తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఎడ్వర్డుపేటలో టీడీపీ, వైసీపీ వర్గీయుల ఘర్షణ

రొంపిచర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడ్వర్డుపేటలో తెలుగుదేశం పార్టీ, వైసీపీ వర్గీయుల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లోకేశ్, ఉమర్ వలి మధ్య వాహనాలకు దారి ఇచ్చే క్రమంలో వివాదం తలెత్తింది. దీనిని గ్రామంలోకి వెళ్లి టీడీపీ, వైసీపీ నాయకులకు చెప్పటంతో రాళ్ళు రువ్వుకొని గొడళ్ళ, కర్రలతో దాడులు చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన కొలగాని సైదారావు, దేసిబోయిన శ్రీరాములు, గాలం వెంకటేష్‌లకు, వైసీపీకి చెందిన కోడూరి చినఅంజిరెడ్డిలకు గాయాలయ్యాయి. నరసరావుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు. ఎస్ఐ మణికృష్ణ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. చికిత్స పొందుతున్న టీడీపీ సానుభూతిపరులను ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు సోమవారం పరామర్శించారు.

24మంది జూదరుల అరెస్టు: రూ.10,400 సీజ్

యడ్లపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేర్వేరు గ్రామాల్లోని పేకాట స్థావరాలపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 24మంది జూదరులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి 10,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. తొలుత కొండవీడు గ్రామ శివారులోని పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు పేకాడుతున్న 16మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 6,800 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. అదేరోజు సాయంత్రం ఉప్పరపాలెం గ్రామ ఊరివెలుపల స్థావరంపై దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి 3,600 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

వార్డులకు టీడీపీ కొత్త కమిటీలు

చిలకలూరిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా పట్టణంలోని 6, 24, 26, 30 వార్డులకు కొత్త కమిటీలను ఎన్నుకున్నారు. పట్టణ టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవిల ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఆయా వార్డులకు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా 6వ వార్డుకు ఉప్పలపాటి సురేష్, షేక్ సుభాని, 24వ వార్డుకు సయ్యద్ మస్తాన్ వలి, మసాలా సాంబయ్య, 26వ వార్డుకు బండారు రాఘవ, అన్నపురెడ్డి నాగరాజు, 30వ వార్డుకు షేక్ ఖాజా పాషా, షబ్బీర్ అలీ ఎన్నికయ్యారు. కొత్త కమిటీలను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అభినందించారు.

అన్నదాత సుఖీభవ పథకంలో పేర్లు నమోదు చేయించుకోవాలి: ఏవో

వినుకొండ, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు అన్నదాత సుఖీభవ పథకంలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.వరలక్ష్మి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులు తమ పొలం పాస్ పుస్తకం, 1బీ, బ్యాంక్ పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబరుతో సమీపంలోని రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని కలిసి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి: డీఎస్పీ నాగేశ్వరరావు

చిలకలూరిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న చిలకలూరిపేట ప్రత్తిపాటి గార్డెన్స్‌లో శంకర నేత్ర వైద్యశాల సహకారంతో నిర్వహించే ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు సోమవారం కోరారు. గత 36సంవత్సరాలుగా చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఏటా వైద్య ఉచిత సేవలను ప్రజలకు అందించడం అభినందనీయమన్నారు. శిబిరం నిర్వాహకులు ఆర్టీసీ కంచర్ల శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్ పాల్గొన్నారు.

బకాయిల విడుదలపై సీహెచ్‌వోల హర్షం

నరసరావుపేట టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ముఖ్యమైన డిమాండ్ అయిన ప్రోత్సాహకాల ఆరు నెలల బకాయిలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై సీహెచ్‌వోలు హర్షం వ్యక్తంచేశారు. సోమవారం ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ ఉద్యోగులైన సీహెచ్‌వోలు నరసరావుపేట గాంధీ పార్కు వద్ద నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 15వ రోజుకు చేరింది. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాగర్, వినోద్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురం గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా వెంకటేష్

శావల్యాపురం, మే 12 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం గ్రామ టీడీపీ నూతన కార్యవర్గసభ్యుల ఎన్నికలను సోమవారం నిర్వహించారు. గ్రామపార్టీ అధ్యక్షుడిగా నలమాటి వెంకటేష్‌ను రెండోసారి ఎన్నుకోగా, ప్రధాన కార్యదర్శిగా గట్టుపల్లి వీరాంజనేయులును ఎన్నుకొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను నాయకులు సత్కరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 75 ఫిర్యాదులు



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జరిగింది. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రజల వద్ద నుంచి 75 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సమస్యలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. నరసరావుపేటలోని శాలెం నగర్‌కు చెందిన రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి వేముల మోహన్‌రావు తన కుమారుడు మనుమడు తనను ఆస్తి ఇవ్వవలసిందిగా బెదిరిస్తున్నారని ఆరు నెలల క్రితం తను అద్దెకు ఉంటున్న ఇంటికి వచ్చి దౌర్జన్యంచేసి ఆస్తికి సంబంధించిన దస్తావేజులను బలవంతంగా లాక్కెళ్లారని న్యాయం చేయాలని ఫిర్యాదుచేశారు. చిలకలూరిపేటకు చెందిన సువర్ణ లక్ష్మీ తాను మరికొందరు రిటైర్డ్ మిలిటరీ ఉద్యోగి హరిశంకర్ అనే వ్యక్తి పల్నాడు కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ ఏర్పాటు చేయగా తాము చిట్టీలు వేసి రూ.60లక్షలు డబ్బు చెల్లించామన్నారు. తదుపరి హరిశంకర్ సదర్ కో-ఆపరేటివ్ సొసైటీని వేరే బ్యాంకులో కలిపారని తమకు నగదు ఇవ్వలేదని, నగదు గురించి అడుగుతుంటే బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారు ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందజేశారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు ఎస్పీ కంచిశ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు వెల్ఫేర్ ఆర్ఐ ఎల్ గోపీనాథ్ భోజన ఏర్పాట్లు చేశారు.

విద్యారంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నారు

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు, టీఎస్ఎన్ మల్లేశ్వరరావు తదితరులు

నరసరావుపేట టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పునఃవ్యవస్థీకరణ పేరుతో విద్యారంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నారని యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా డీఈవో కార్యాలయం వద్ద పాఠశాలల పునఃవ్యవస్థీకరణ, బదిలీలు, ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కే శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకున్న ట్రాన్స్‌ఫర్స్ చట్టాన్ని తీసుకువచ్చిందని, అదే సందర్భంగా రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువ అయ్యేలా ఉన్నాయని, దీనిని యూటీఎఫ్ ఖండిస్తోందన్నారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావాలంటే ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల, విద్యార్థుల నిష్పత్తి 1:20 ఉండాలని, అన్నిరకాల పాఠశాలలో నిష్పత్తి ఆ విధంగా ఉండాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టీఎస్ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం 117 జీవోకు ప్రత్యామ్నాయం తీసుకొస్తామని చెబుతూనే మరింత గందరగోళంగా తీసుకువచ్చిన పరిస్థితి కనబడుతోందన్నారు. ప్రభుత్వం విద్యారంగంలో తొమ్మిది రకాల పాఠశాలలు తీసుకొచ్చి మరింత గందరగోళానికి గురిచేస్తోందన్నారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఈ నెల 15న రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తామన్నారు. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో, కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు, ఎ.భాగేశ్వరిదేవి, ఎం.రవిబాబు, జే.వాల్యానాయక్, షేక్ ఖాశింపీరా, ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు కొల్లా రాజమోహనరావు
- యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బర్లీ పొగాకు రైతుల ఆందోళన



డీటీ అనూరాధకు వినతిపత్రం అందజేస్తున్న నల్లమడ రైతుసంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు, ప్రజాసంఘాల నాయకులు, రైతులు

యడ్లపాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): నల్ల బర్లీ పొగాకు సాగుచేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి నల్ల బరీ పొగాకుకు స్పష్టమైన మద్దతు ధర నిర్ణయించాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు కొల్లా రాజమోహనరావు డిమాండ్ చేశారు. నల్లబర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. పొగాకు రైతులపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ కనీస మద్దతు ధర కల్పించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలు నాణ్యత పేరుతో పొగాకు కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తుండడంతోపాటు, స్థానిక వ్యాపారులను కూడా కొనుగోలు చేయనీయకుండా చేస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో సుమారు 5వేల ఎకరాల్లో నల్లబర్లీ పొగాకును రైతులు సాగుచేశారని, సాగుచేసిన వారంతా సన్న, చిన్నకారు రైతులేనని, కనీసం పండించిన పంటను భద్రపరచుకునేందుకు కూడా అవకాశం లేక పొలాల్లోనే ఉంచుకోవాల్సిన దుస్థితిలో ఉన్నారన్నారు. గత ఏడాది నల్ల బర్లీ పొగాకును క్వింటా రూ.15వేల నుంచి రూ.18వేలకు కొనుగోలు చేశారని, ప్రస్తుతం అది రూ.6వేలకు పడిపోయిందన్నారు. పెట్టుబడులు, కూలీల డిమాండ్ పెరగడంతో ఎకరాకు రూ.1.50లక్షల వరకు ఖర్చులు అవుతున్నాయన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న ధరకు రైతులు విక్రయించుకుంటే ఎకరాకు రూ.60వేలకు పైగా నష్టం వస్తుందన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించినప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లబర్లీ రకాన్ని పొగాకును బోర్డులో చేర్చాలని, కంపెనీలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా బోర్డు, ప్రభుత్వం చర్యలు చేపట్టాలని లేదా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులు తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ అనూరాధకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దాసరి వరహాలు, రైతు సంఘం నాయకులు కల్లూరి రామారావు, రైతులు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాలేష్‌కు సేవా భూషణ్ అవార్డు

వినుకొండ టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు పెద్దిటి పాలేష్‌కు సేవా భూషణ్ అవార్డు లభించింది. విజయవాడలోని కౌతా పరిపూర్ణానంద కళావేదికలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాలేష్‌కు సేవా భూషణ్ అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు.

కవి కమలారామ్‌కు కవిరత్న అవార్డు

వినుకొండ, మే 12 (ఆంధ్రజ్యోతి): కళావేదిక ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన కవి కమలారామ్ కవిరత్న అవార్డు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఆధ్వర్యంలో వేదిక చైర్మన్ ప్రపంచ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన ఈ నెల 10,11 తేదీల్లో ఏలూరులో జరిగిన ప్రపంచ తెలుగు సాహితి సంబరాల్లో కవి కమలారామ్‌కు ఈ అవార్డు అందజేసి ఘనంగా సన్మానించారు.

సమ్మెను విజయవంతం చేయాలి: మారుతీ వరప్రసాద్

బొందిలిపాలెం (శావల్యాపురం) మే 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ నిరంకుశ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 20వ తేదీన జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెను ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ పిలుపునిచ్చారు. సీపీఐ మండల మహాసభను శావల్యాపురం మండలం బొందిలిపాలెంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ నేతలు, కార్యకర్తలు పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించి జండా వందనం చేశారు. అనంతరం 9మంది సభ్యులతో కూడిన సీపీఐ మండల నూతనకమిటీని ఎన్నుకొన్నారు. సీపీఐ నేతలు చిన్నసుభానీ, పవన్‌కుమార్, మల్లికార్జున్, కొండలు, వెంకట్రావు పాల్గొన్నారు.

పమిడిపాడులో రైతు సదస్సు

నరసరావుపేట రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ అగ్రికల్చర్ బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు శిక్షణలో భాగంగా సోమవారం గ్రామంలో రైతు సదస్సు వ్యవసాయ ప్రదర్శన గ్రామస్థుల సహకారంతో నిర్వహించారు. ఇందులో భాగంగా ఎరువుల వాడకం, భూ పరిరక్షణ, నాబార్డ్ బ్యాంకు అందించే వ్యవసాయ సంక్షేమ, సహాయ, ఆర్థిక పథకాలు వివరించారు. ముఖ్యఅతిథిగా నర్సరావు పేట ఎమ్మెల్యే అరవిందబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామ్‌కోటేశ్వరరావు మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరావు కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్ పాల్గొన్నారు.

ఘనంగా భావన్నారాయణ స్వామి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో భావన్నారాయణస్వామి



పూజల్లో పాల్గొన్న జీవీ ఆంజనేయులు దంపతులు

ఈపూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనుమెళ్ల గ్రామంలో శ్రీభావన్నారాయణస్వామి తిరునాళ్ల సోమవారం ఘనంగా జరిగింది. తిరునాళ్లను పురస్కరించుకొని భక్తులు వేకువజాము నుండే స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. మహిళలు పొంగళ్ళు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామస్తులు విద్యుత్ ప్రభలు నిర్మించి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎస్ఐ ఎం ఉమహేశ్వరరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అంకాళపరమేశ్వరి అమ్మవారి కొలుపులు ప్రారంభం

ఈపూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్లలోని అంకాళపరమేశ్వరి అమ్మవారి కొలుపులు ప్రారంభమయ్యాయి. అమ్మవారు గుడిలోకి జలబిందెల ఊరేగింపుతో తీసుకువచ్చి గుడిలో ఉంచారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

విప్పర్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ...

రొంపిచర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్ల గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి జయంతిని పురస్కరించుకొని పలు కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. భక్తి గీతాల కార్యక్రమాన్ని నిర్వహించారు.



విప్పర్లలో జరిగిన లక్ష్మీనరసింహస్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు



ఊరేగింపుగా వెళ్తున్న కొచ్చెర్ల గ్రామస్థులు

అరెస్టులపై మాజీ మంత్రి రజిని తీరు సరికాదు: టీడీపీ నాయకులు

చిలకలూరిపేట, మే12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాంత్ రెడ్డి అరెస్టును అడ్డుగా పెట్టుకుని మాజీ మంత్రి విడదల రజిని, ఇతర వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు, అనుసరిస్తున్న వైఖరిని చిలకలూరిపేట సీనియర్ టీడీపీ నాయకులు సోమవారం తీవ్రంగా ఖండించారు. విలేకరుల సమావేశంలో రజిని హయాంలో చేసిన అక్రమ అరెస్టుల పేపర్ క్లిప్పింగులను వారు ప్రదర్శించారు. జగన్ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతల అరెస్టులన్నీ చట్టప్రకారమే జరిగాయా అని ప్రశ్నించారు. చిలకలూరిపేటలో వాటర్ ప్లాంట్ ప్రారంభానికి వెళ్లిన ప్రత్తిపాటిని అడ్డుకొని, ఆయనపై తప్పుడు కేసులు పెట్టించినప్పుడు రజినీకి చట్టం గుర్తురాలేదా అని మండిపడ్డారు. రాజకీయాలతో సంబంధంలేని ప్రత్తిపాటి కుమారుడు శరత్‌ను అరెస్టు చేయించి, విజయవాడలో పలు పోలీసు స్టేషన్లు తిప్పి వేధించినపుడు రజినీకి నిబంధనలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చిన సొంత పార్టీ ఎంపీపై రజిని చేయించిన దాడి ఇప్పటికీ ప్రజలు మర్చిపోలేదన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో ఎవరికి ఏ పని కావాలన్నా పర్సంటేజీలు వసూలుచేసిన ఘనత రజినీదని, ఆమె అవినీతి దాహానికి పోలీస్ శాఖ బలైందన్నారు. ఐదుగురు సీఐలు ఏకంగా వీఆర్‌కు వెళ్లడమే అందుకు నిదర్శమన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో రజిని చేసిన అవినీతి, ప్రజలకు చేసిన మంచిపై ఆమె బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. కోడిగుడ్ల కాంట్రాక్టు ఇప్పిస్తానంటే శ్రీకాంత్ రెడ్డిని నమ్మి తాను డబ్బులు ఇచ్చి మోసపోయాయని టీడీపీ నాయకులు ఎంవీ రత్నారెడ్డి వెల్లడించారు. అందుకే ఫిర్యాదు చేశానన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా, గంగా శ్రీనివాసరావు, ముద్దన నాగేశ్వరరావు, తుపాకుల అప్పారావు, నెల్లూరి సదాశివరావు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలి తనిఖీలు

నరసరావుపేట రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సోమవారం పల్నాడు జిల్లాలోని సాతులూరు, జొన్నలగడ్డ, పెట్లూరివారిపాలెం, పమిడిపాడు, ఉప్పలపాడు గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతాయుతంగా జవాబు దారితనంతో బాలల హక్కులను పరిరక్షించాన్నారు. అంగన్వాడీ కేంద్రంను బావి వద్ద కాకుండా అంగన్వాడి సెంటర్లలో నిర్వహించాలని సీడీపీఈవోకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అంగన్వాడీ సెంటర్ల రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి, నాదెండ్ల సీడీపీవో శాంతకుమారి సూపర్‌వైజర్ల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ తోకల శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



ఎమ్మెల్యే ప్రత్తిపాటిని కలిసిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తోకల శ్రీనివాసరావు

చిలకలూరిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ తోకల శ్రీనివాసరావు (పీడియాట్రిషన్) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ కె విజయలక్ష్మికుమారి బదిలీపై విజయవాడకు వెళ్లారు. అనంతరం ఆయన ప్రభుత్వాసుపత్రి డాక్టర్లతో వెళ్లి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు బాధ్యతతో మెలిగి చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని ఎమ్మెల్యే సూచించారు.

వైభవంగా శ్రీలక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి

చిలకలూరిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొమరవల్లిపాడులోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం గరుడోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం (పెద్ద రథం తిరునాళ్ల) కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమాలు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఆర్ఎంవీ రామచంద్రరావు, కార్యనిర్వణాధికారి బి.అశోక్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగాయి.

నాదెండ్లలో వైభవంగా రథోత్సవం



నాదెండ్ల రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నాదెండ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో గంగా పార్వతీ సమేత మూలస్థానేశ్వర స్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవతా మూర్తులకు వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తుల విగ్రహాలను రథంపై ఉంచి ఊరేగించారు. పూజారులు ఇర్లపాటి సాంబశివరావు, కాశీ విశ్వనాథ్, వాసు, సురేష్ శర్మల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.